# పనులలో వేగం

## సత్వర నిర్మాణమే ధ్యేయం

### 'పోలవరం'పై ముఖ్యమంత్రి వర్చువల్ రివ్యూ

విజయవాడ, ఫిబ్రవరి 13: పోలవరం పనులలో వేగం మరింత పెంచాలని, నిర్ణిత షెడ్యూల్‌లో ఒక వారం ఆలస్యమైనా వెనుకబడిపోతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రాజెక్టు కావడం వలన అడుగడుగునా ఆ స్ఫూర్తి కనిపించాలని కోరారు. 'నేను హృదయంలో నిలుపుకున్న ప్రాజెక్టు ఇది. అందుకే వారం వారం సమీక్షకు అత్యధిక సమయం కేటాయిస్తున్నాను. పనులలో ఎప్పుడు ఏ సమస్య వచ్చినా సందేహించకుండా నేరుగా నా దగ్గరకు రండి, వెంటనే సమయం ఇస్తాను. ఎన్ని గంటలైనా కూర్చుని చర్చిద్దాం. పోలవరం పనులు అనుకున్న సమయానికి అనుకున్నట్టుగా పూర్తయితీరాలి'– అని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయి నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పర్యవేక్షించారు. దీనిపై అధికారులతో సమీక్షిస్తూ, ఎలాంటి పరిస్థితులలోనూ పనులలో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. అవసరమైతే ఒక వారం రోజులు పోలవరంలోనే వుండి ప్రత్యక్షంగా పనుల పర్యవేక్షణ చేస్తానని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనుల గురించి చర్చించడానికే గతంలో ప్రత్యేకంగా మంత్రిమండలి సమావేశం జరిపామని గుర్తుచేశారు.

పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించిన స్టీల్, సిమెంట్ కొనుగోలుకు ఆయా కంపెనీలతో నేరుగా మాట్లాడుతానని, అవసరమైతే ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపులు చేసి స్టీల్, సిమెంట్‌కు కొరత లేకుండా చూస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. పోర్టులో నిలిచిపోయిన మిషనరీని ప్రాజెక్టు ప్రాంతానికి తలలించేందుకు ప్రభుత్వం తరుపున ప్రత్యేకంగా ఒక లైజన్ అధికారిని నియమిస్తామని ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి నిర్మాణ సంస్థలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని, ఒకవేళ వ్యవధిలోగా పనులు పూర్తిచేయడానికి ఇబ్బందులు ఎదురైన పక్షంలో ఇంజనీరింగ్ అధికారులు జోక్యం చేసుకుని అవసరమైన సాంకేతిక, ఇతర సహకారాన్ని అందించాలని సూచించారు. నిర్మాణదశలోని ప్రతి స్థాయిలోనూ సానుకూల దృక్పధంతో మెలగాలని, చురుకైన పనితీరు కనబర్చాలని చెప్పారు. ప్రజల అవగాహన కోసం పోలవరం ప్రాజెక్టు దగ్గర ఎగ్జిబిషన్, మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఎగ్జిబిషన్, మ్యూజియం ఏర్పాటు బాధ్యతలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్‌కు అప్పగించారు.

ఈనెల 1 నుంచి 12 వరకు స్పిల్ వే నిర్మాణానికి సంబంధించిన మట్టి తవ్వకం పనులలో 5.25 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వవలసి వుండగా, 4.75 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు జరిగాయి. స్పిల్ ఛానల్ నిర్మాణానికి సంబంధించిన పనులలో 29.30 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం జరగాల్సివుండగా, 12.78 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తిచేశారు. ఎడమభాగం (లెఫ్ట్ ఫ్లాంక్) పనులలో 5.16 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం చేపట్టవలసి వుండగా, 1.49 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తిచేశారు. అప్రోచ్ ఛానల్ పనులకు సంబంధించి 3.6 లక్షల క్యూబిక్ మీటర్ల పనులకు గాను, 1.70 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. పైలట్ ఛానల్‌కు సంబంధించిన పనులలో 1.32 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను, 0.75 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు జరిపారు. మొత్తం అన్ని పనులకు సంబంధించి నిర్ధేశించిన లక్ష్యం 44.63 లక్షల క్యూబిక్ మీటర్లు కాగా, 21.47 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తిచేశారు. త్రివేణి సంస్థ 50 శాతం పనులు పూర్తిచేయగా, ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ 35 శాతం పనులు పూర్తిచేసింది. స్పిల్ వే కాంక్రీట్ పనులలో 14 శాతమే పూర్తయ్యిందని, 86 శాతం పనులు పూర్తిచేయడానికి నిర్మాణ సంస్థలు సత్వరం పూనుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

ఈవారంలో స్పిల్ వే నిర్మాణానికి మట్టి తవ్వకం పనులలో 3.20 లక్షల క్యూబిక్ మీటర్లు, స్పిల్ ఛానల్ నిర్మాణానికి 18.20 లక్షల క్యూబిక్ మీటర్లు చొప్పున మట్టి తవ్వకం పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్ధేశించారు. అలాగే, ఎడమభాగం పనులకు సంబంధించి 3.57 లక్షల క్యూబిక్ మీటర్లు, అప్రోచ్ ఛానల్‌కు సంబంధించి 2.10 లక్షల క్యూబిక్ మీటర్లు, పైలట్ ఛానల్‌కు సంబంధించి 0.77 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు.

### సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలి: అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు

రాష్ట్రంలో రానున్న వర్షాకాలం నాటికల్లా వాన నీటిని భూగర్భజలాలుగా మళ్లించేందుకు వీలుగా కాల్వలు, రిజర్వాయర్లు, చెరువుల మరమ్మతులు పూర్తిచేసేందుకు అవసరమైన కార్య ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రాధాన్య జల వనరుల ప్రాజెక్టులు, సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే రిజర్వాయర్లు, ఇతర అంశాలపై సమీక్షించారు. సాగునీటి సంఘాలు పెత్తనం చేయడానికి కాకుండా ప్రజలు, రైతుల నీటి అవసరాలను తీర్చే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. నదులు, జల వనరుల అనుసంధానంలో భాగంగా ప్రధానమైన కాలువల మరమ్మతులు, వాటి నిర్వహణ పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని రిజర్వాయర్ల ప్రస్తుత స్థితిని ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. గాలేరు-నగరి తొలిదశ పనులు పూర్తయినందున, రెండవ దశ నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన టెండర్లు పిలవాలని, గాలేరు-నగరి, కేసీ కెనాల్ మధ్య పరస్పర నీటి మార్పిడి విధానాన్ని కల్పించే

విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుంగభద్ర, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల ద్వారా రాయలసీమ జిల్లాలకు నీటి కొరత లేకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని చెప్పారు. మడకశిర–చిత్తూరు–కుప్పం ప్రాంతాలకు ఏప్రిల్ 15 లోగా నీరు అందించాలని చెప్పారు.

వెలిగొండ ప్రస్తుత స్థితిపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగం పనులను సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లాలో పశ్చిమభాగాన నీటి ఎద్దడి తీవ్రంగా వున్నదని, అవసరమైన చర్యలు తీసుకుని ఈ వేసవిలో సమస్య లేకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. గోదావరి–పెన్నా అనుసంధానంపై వెంటనే కసరత్తు మొదలుపెట్టాలని చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు నీరు అందిస్తే అక్కడి నుంచి విశాఖ నగరానికి నీరు అందించవచ్చునని అన్నారు. దీనికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను సత్వరం పూర్తిచేయాలని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించామని, పైపుల తయారీ పనులు అక్కడే ఆరంభించామని, పవర్ హౌస్ నిర్మాణం చేపట్టాలని జెన్‌కోకు లేఖ రాశామని ఇఎన్‌సీ వెంకటేశ్వరరావు ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు వంశధార, నాగావళి నదుల అనుసంధానమే పరిష్కారమని, దీనికి తగిన ప్రతిపాదనలను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు.

వంశధార నిర్వాసితుల పరిహారం చెల్లింపు అంశాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు. ఇప్పటికే 50 శాతం పరిహారం బాధితులకు అందించామని అధికారులు చెప్పగా, మిగిలిన మొత్తాన్ని సాధ్యమైనంత వేగంగా పూర్తిచేయాలని సీయం ఆదేశించారు. ఎస్ఈలు, సీఈలు కేవలం ప్రాజెక్టులు నిర్మించడం, కాలువలు తవ్వించడమే తమ విధి అని అనుకోరాదని, అన్ని జిల్లాలలో ప్రజలకు తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించడం కూడా తమ బాధ్యతగా గుర్తెరిగి పనిచేయాలని హితవుపలికారు.